## ఉచిత బస్సు సౌకర్యంతో ప్రయాణికుల అవస్థలు



నిర్మల్- మంచిర్యాల ఆర్టీసీ బస్సులో పరిమితికి మించి ప్రయాణిస్తున్న జనం

ఖానాపూర్, డిసెంబర్ 22 : ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలు, ఉద్యోగస్తులు, విద్యార్థులు అస్థలకు గురవుతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం నిర్మల్-మంచిర్యాల ఆర్టీసీ బస్సులో ఖానాపూర్ రావడానికి వందల మంది ప్రయాణికులతో కిక్కిరిసి పోయింది. తమ గమ్యస్థానానికి వెళ్లాలంటే బస్సులు సరిపోవడంలేదని ఆరోపించారు. ఉన్న బస్సులో సామర్థ్యానికి మించి జనాన్ని ఎక్కించడంతో ఎక్కడ ప్రమాదం చోటుచేసుకుంటదోనన్న భయంతో ప్రయాణించాల్సి వస్తుందని అంటున్నారు. సీట్లు దొరక్క పోవడంతో ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తున్నదని తెలుపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకం ప్రజల ప్రాణాలతో చెలగాటమడుతున్నదని పలువురు మండిపడుతున్నారు. కాంగ్రెస్ సర్కారు హామీలను అమలు చేయకుండా పాలన అస్తవ్యస్తంగా ఉందని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం నరక ప్రాయంగా మారిందని విసిగిపోతున్నారు.

## రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయండి



మహాసభలకు సంబంధించిన కరతప్రతాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఎదులాపురం,డిసెంబర్22: ఈనెల 28, 29, 30 తేదీల్లో నల్గొండ పట్టణంలో జరిగే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే కిష్టన్న, వీ అశోక్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్ర మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్ర ఇక్కడ జిల్లా కోశాధికారి కే శ్రీనివాస్ కార్యదర్శులు శివన్న, గణేశ్ మండలాల బాధ్యులు శంకర్, గంగాదర్, దిలీప్, శివన్న, అశోక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీవీ రావుకు ఘన నివాళి



పీవీ రావ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బోథ్, డిసెంబర్ 22 : మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు 19వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో (మాల మహానాడు) మాల సంక్షేమ సంఘం బోథ్ కోశాధికారి బోడ లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ మునేశ్వర్, గ్రామ కమిటీ జాయింట్ సెక్రటరీ ఊశన్న, రవి, రమేశ్, కర్ణాకర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు భూమేశ్, రవి, సోమన్న పాల్గొన్నారు.

# ప్రకృతి వనం మొక్కలపై చిన్నచూపు

- వృథాగా పడి ఉన్న నీటి ట్యాంకర్
- ఎండిపోతున్న మొక్కలు



బజార్‌హత్నూర్ మంజారంతండాలోని ప్రకృతి వనంలో ఎండిపోతున్న మొక్కలు



ప్రకృతి వనంలో వృథాగా పడి ఉన్న నీటి ట్యాంకర్

బజార్‌హత్నూర్, డిసెంబర్ 22 : బజార్‌హత్నూర్ మండలంలోని మంజారంతండా గ్రామంలోని పల్లెప్రకృతి వనంలోని మొక్కలు ఒక పక్క నీటి వసతి లేక ఎండిపోతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. మొక్కలను పెంచు పర్యావరణాన్ని రక్షించు అనే మాటలు కేవలం మాటల వరకే అని చేతల్లో కాదని నిరూపిస్తున్నారు అధికారులు. గతంలో సర్పంచుల పదవీ కాలంలో పర్యవేక్షణ ఉండేదని, ప్రత్యేకాధికారుల పాలనలో ప్రకృతి వనాలపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా ప్రకృతి వనంలోనే నీటి ట్యాంకర్ వృథాగా పడి ఉంది. మొక్కలు ఎండిపోతున్నా నీళ్లను పట్టకపోవడంపై వాళ్ల పనితీరు ఏవిధంగా ఉందో అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇలాంటి వాటిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారని అని ప్రజలు చర్చికుంటున్నారు.

### నేడు ఉత్తమ రైతులకు సన్మానం

ఖానాపూర్, డిసెంబర్ 22: ఖానాపూర్ మున్నూరుకాపు సంఘం అధ్వర్యంలో మండల ఉత్తమ రైతులను నేడు సన్మానించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కడుకుంట్ల రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన రైతులతోపాటు ప్రజలు, రైతు సంఘాల నాయకులు పట్టణంలోని రైతు నాగలి విగ్రహం వద్దకు ఉదయం 11 గంటల వరకు రావాలని కోరారు.

### అందుబాటులో యూరియా

ఖానాపూర్, డిసెంబర్ 22: ఖానాపూర్ పీఏసీఎస్ అధ్వర్యంలో మండల రైతులకు యూరియా బ్యాగులు అందుబాటులో ఉన్నాయని సీఈవో భూమి ఆశన్న ఆదివారం తెలిపారు. 45 కిలోల బ్యాగు సబ్సిడీపై ప్రభుత్వ ధర రూ.270కి విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు తమ పట్టాపాస్ బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 22 : నిర్మల్ పట్టణంలో విద్యుత్ మరమతుల దృష్ట్యా సోమవారం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటుందని విద్యుత్ శాఖ డీఈ నాగరాజు ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆశ్రా కాలనీ, విజయనగర్ కాలనీలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

### సీసీ కెమెరాల ఏర్పాటు

కుభీర్, డిసెంబర్ 22 : మండలంలోని పార్డి(కె) గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రెండు సీసీ కెమెరాలను కుభీర్ ఎస్ఐ రవీందర్ ఏర్పాటు చేశారు. ఇటీవల గ్రామంలోని దళితులు అంబేద్కర్ విగ్రహానికి ప్రహరీ గోడను ధ్వంసం చేశారని శనివారం పలువురు భైంసా ఏఎస్పీకి విన్నవించడంతో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భైంసా రూరల్ సీఐ నైలు వాటిని పరిశీలించారు.



దస్తురాబాద్ : ట్రాక్టర్‌తో జంబు కొట్టిస్తున్న రైతు

# యాసంగికి సమాయత్తం

దస్తురాబాద్/ఖానాపూర్,డిసెంబర్22 : యాసంగి సాగు కోసం మండలంలోని రైతులు సమాయత్తం అవుతున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ట్రాక్టర్లతో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ఇది వరకే రైతులు మొలక అలకడం పనులను పూర్తి చేశారు. వరి నాట్లను వేసేందుకు రైతులు ట్రాక్టర్ల సహాయంతో దుక్కులు దున్నడం, జంబు కొట్టించడం పనులను చేయిస్తున్నారు. కాగా పలు గ్రామాల్లో బోర్ల కింద రైతులు వరి నాట్లు వేశారు. ఖానాపూర్ మండల రైతులు కరెంట్ మోటర్ల కింద సాగు పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ఖానాపూర్ మండలంలోని తర్లపాడు, సత్తనపెల్లి, బాదనకుర్తితో పాటుగా పలు గ్రామాల్లో వరి నాటు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. బీఆర్ఎస్ హయాంలో మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల అభివృద్ధి చేయడంతో బోరు బావుల్లో తగినంత నీరు ఉంటున్నదని రైతులు అంటున్నారు. పంట పెట్టుబడుల కారణంగా అప్పుల బారిన పడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో షరుతులు లేకుండా రైతు భరోసా పథకం ద్వారా పంట పెట్టుబడి సాయం అందించాలని కోరుతున్నారు.



ఖానాపూర్: సత్తనపెల్లి శివారులో వరినాట్లు వేస్తున్న రైతు కూలీలు

### సూర్యగుట్ట ప్రాంతంలో గాలింపు

భీంపూర్, డిసెంబర్ 22: భీంపూర్ మండల సరిహద్దు సూర్యగుట్ట ప్రాంతంలో హైనా లాంటి జంతువు సంచరిస్తున్నదని స్థానిక గిరిజన రైతులు చెబుతున్నారని అధికారులు ఆ ప్రాంతంలో గాలించారు. మొన్న గుట్ట దిగువన హైనా లాంటిది ఒక కుక్కపై దాడిచేసి చంపిందని కొజ్జన్‌గూడ రైతులు చెప్పారు. ఈ క్రమంలో అర్లి(టి) ఫారెస్ట్ సెక్షన్ అధికారులు ప్రాంతంలో పులి లేదా చిరుతపులి ఆనవాళ్లు లేవని ధ్రువీకరించారు.

### కడుపునొప్పితో ఒకరి ఆత్మహత్య

జైనథ్, డిసెంబర్ 22 : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గడ్డం స్వామిరెడ్డి (49) కడుపునొప్పి భరించలేక శనివారం రాత్రి 12 గంటల ప్రాంతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్ఐ పురుషోత్తం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతుడు గడ్డం సామి ఆరు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతుండేవారని అన్నారు. శనివారం అర్ధరాత్రి ఇంట్లో పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### మధ్యాహ్న భోజన కార్మికులకు సన్మానం

భీంపూర్, డిసెంబర్22: భీంపూర్ మండలం కరంజి(టి) ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు నాణ్యతగల భోజనం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు పోసాని, పార్వతీబాయిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆదివారం చీరసారెలతో సన్మానించారు. అంతకుముందు బదిలీ, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఇక్కడ హెచ్ఎంలు ముంతాజ్ బేగం, పాలెపు భూమన్న, రూప, రుబీనా, గోవింద్, దత్తు, నాయకులు నరేందర్, దేవారెడ్డి, ఆకటి నరేందర్‌రెడ్డి, రెడ్డి రమేశ్, శంకర్, అనిల్, సతీశ్ యాదవ్, లక్ష్మణాచారి, కార్యదర్శులు లోకేశ్, వినోద్ తదితరులున్నారు.

### భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

లోకేశ్వరం, డిసెంబర్, 22 : భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం లోకేశ్వరం మండలంలోని గొడిసెరా గ్రామానికి చెందిన దుంపల లక్ష్మణ్ (30)తో భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మణ్ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

### ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం, డిసెంబర్ 22: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఏఎన్ఎంల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఇబ్బందులు, పెండింగ్ వేతనాలు తదితర వాటిపై చర్చించారు. ఇక్కడ ఏఎన్ఎం యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కమల, అనిత, కోశాధికారి సురేందర్, ఉపాధ్యక్షురాలు నర్మద, కామేశ్వరి, జంగుబాయి, అశ్విని, అనిత, విజయ్ తదితరులున్నారు.

### ఆత్మరక్షణకు కరాటే దోహదం

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 22 : అమ్మాయిల ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదం చేస్తుందని సోన్ సీఐ నవీన్ కుమార్ అన్నారు. ఆదివారం నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో తేజేందర్ సింగ్ బాటియా, శ్రీకాంత్, అమ్ముల భూషణ్, రాజ్‌కుమార్, వంశీ, చిరంజీవి, మృణాళిని, పూనమ్, నరేశ్, కరీం, తదితరులున్నారు.

### అంగన్‌వాడీ టీచర్‌కు ఘన సన్మానం

ఎదులాపురం, డిసెంబర్ 22: ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్య నగర్ అంగన్‌వాడీ టీచర్ కే రాధ 29 సంవత్సరాలు అక్కడే పనిచేసి ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఆమెను కాలనీ మహిళలు చీరసారెలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రఘునాథ్, కాలనీవాసులు రమేశ్, మాణిక్‌రావు , జలంధర్, ఆసిఫ్‌ఖాన్, శ్రీలత, భాగిర్థ , కృష్ణవేణి, రఫిక తదితరులున్నారు.

### రైతు బంధు తొలగించేందుకు కుట్ర

భైంసా, డిసెంబర్, 22 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన రైతు బంధు పథకాన్ని ప్రస్తుత రేవంత్ రెడ్డి సర్కార్ తొలగించేందుకు కుట్ర చేస్తున్నదని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ ఆరోపించారు. ఆదివారం భైంసాలో విలేకరులతో మాట్లాడుతూ, ఆంక్షలు, కోతలతో సగం మంది రైతులను ఎగనామం పెట్టే యోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. ప్రతి ఎకరాకూ, ప్రతి రైతుకూ పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని పరిశీలిస్తే రైతాంగానికి అన్యాయం చేసిందని అర్థమవుతుందన్నారు. అన్నదాతలు, రైతులు, ప్రజలు ఇప్పటికైనా మేల్కొనకపోతే రానున్న రోజుల్లో గోస పడాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ మార్గదర్శకాలనే రైతు భరోసా కూడా వర్తింప జేస్తామని చెబుతున్నందున రైతాంగానికి మరింత అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

### కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

భైంసాటౌన్, డిసెంబర్ 22 : దేగాం గ్రామ శివారులో ఇటుక బట్టీ వద్ద ఆదివారం ఉదయం అబ్దుల్ అమీర్ అనే మూడేళ్ల బాలుడిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు, బంధువుల వివరాల ప్రకారం.. ముథోల్ మండలంలోని తరోడా గ్రామానికి చెందిన గఫర్ కుటుంబంతో కలిసి దేగాం ఇటుక బట్టీలో కూలీ పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే అబ్దుల్ అమీర్ అక్కడే ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న కుక్కలు అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గమనించిన కుటుంబీకులు బాలుడిని చికిత్స కోసం ప్రాంతీయ దవాఖానకు తరలించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## బాల్య వివాహాలతో జీవితం ముగింపు

- మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ పవర్ యశోద




కార్యక్రమంలో మాట్లాడుతున్న మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ పవర్ యశోద

ఎదులాపురం, డిసెంబర్ 22: బాల్య వివాహాలతో జీవితం అక్కడే ముగిసిపోతుందని మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ పవర్ యశోద అన్నారు. ఎస్సీ సంక్షేమ బాలికల వసతిగృహం ఆదివారం షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాల కార్మికుల నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆడపిల్లల రక్షణ కోసం 1098, 100, మహిళల కోసం 181 హెల్ప్ లైన్ నెంబర్లు, షీ టీం సభ్యులు 24 గంటలపాటు పనిచేస్తున్నాయన్నారు. ఆడపిల్లల కోసం ప్రత్యేక రక్షణ చట్టాలున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బలవంతంగా పెళ్లికి ఎవరైనా ఇబ్బంది చేసిన 1098 హెల్ప్ లైన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. సఖీ కేంద్రం కేస్ వర్కర్ నాగమణి మాట్లాడుతూ, సఖీ ద్వారా కల్పిస్తున్న సేవలను తెలియజేశారు. షూర్ ఎన్జీవో రూపొందించిన బాల్య వివాహ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంక్షేమ వసతులు గృహాల అధికారులు గంగాదేవి, రోహిణీ, షూర్ ఎన్జీవో డిస్టిక్ కోఆర్డినేటర్ కే వినోద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ తోట సుమలత ఉన్నారు.

## హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం ఏర్పాటు



హాస్టల్ వెల్ఫేర్ నూతన కార్యవర్గ సభ్యులు

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 22: నిర్మల్ జిల్లా హాస్టల్ వెల్ఫేర్ నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటయ్యింది. నిర్మల్ టీఎన్జీవో భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వెల్మల ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షులుగా బోనగిరి సుజయ్, కార్యదర్శిగా టీ రాజేందర్, కోశాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కృష్ణారెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలుగా కవిత, సంయుక్త కార్యదర్శిగా ఆర్ నగేశ్, మహిళా సంయుక్త కార్యదర్శిగా వనజ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్ రాఘవేందర్, పబ్లిసిటీ సెక్రటరీగా ఎన్ నగేష్, కార్యవర్గ సభ్యులుగా శ్రీవాణి, మమత, సుజాత, ప్రశాంత్ ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెల్మల ప్రభాకర్, సెక్రటరీ కుడాల రవికుమార్, టీహెచ్‌డబ్ల్యూవోఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ గౌస్, ఉపాధ్యక్షులు స్రవంతి, నర్సింలు, ముజాహిద్, వెంకటర్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీహరి, అజయ్‌కుమార్, ఏ భాస్కర్, రాజు, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

### సీఆర్టీల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రైతు నేత, సామాజిక ఉద్యమకారుడు హపావత్ రాజేందర్

కడెం, డిసెంబర్ 22 : ఉట్నూర్ పట్టణంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీఆర్టీలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని ఆదివారం రైతు నేత, సామాజిక ఉద్యమకారుడు హపావత్ రాజేందర్ సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. సమ్మె కొనసాగించే వరకు తన వంతు సాయం అందిస్తానని తెలిపారు.

## చెత్త బండ్లకు రెస్ట్



కుభీర్: కుభీర్‌లోని పాత బస్టాండులో చెత్తతో జీపీ ట్రాక్టరు

కుభీర్, డిసెంబర్ 22 : మండలంలోని అన్ని జీపీలలో డీజిల్‌కు డబ్బులు లేక గ్రామంలో చెత్తను సేకరించడం నామమాత్రంగా తయారైంది. ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించిన రోజులు గడిచిపోయాయి. యేడాది క్రితం పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం జీపీలకు నిధులివ్వకపోవడం, సర్పంచుల పదవీ కాలం ముగియడంతో పాలన జేపీఎస్‌లతోపాటు ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లింది. ఏడాది నుంచి అప్పులు చేసి నెట్టుకొచ్చిన అధికారులు ఇప్పుడు చేతులెత్తేశారు. దీంతో గ్రామాల్లో పాలన కుంటుపడింది. చెత్త బండ్లు ఎక్కడికక్కడ విశ్రాంతి తీసుకుంటున్నాయి.

### మేలు జాతి విత్తనాలను వినియోగించాలి

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 22: మేలు జాతి విత్తనాలను వినియోగించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ రజిని, ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నర్సాపూర్(బీ) గ్రామంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జగిత్యాల జిల్లా పొలాస, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ హైదరాబాద్ వారి సహకారంతో జిల్లాలోని 8 గ్రామాల రైతులకు జొన్న సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం హైబ్రీడ్ జొన్న విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సేవా నాయక్, శ్రీనివాస్, విఠల్, ప్రజామిత్ర రైతు సమాఖ్య రైతులు గంగాధర్, నాగోరాంప, ఏఈవోలు జయశ్రీ, రాజశేఖర్, రంజిత్, గ్రామ పటేల్ జ్యోతిరాం, సీసీడీ సిబ్బంది శివరాజ్, ప్రశాంత్, జగన్, రైతులు పాల్గొన్నారు.

## మూడు విద్యుత్ మోటర్లు చోరీ



మోటర్ చోరీకి గురవడంతో ఖాళీ పైపును చూపిస్తున్న రైతు

ఖానాపూర్ టౌన్, డిసెంబర్ 22 : పంటలకు సాగునీరందించేందుకు వ్యవసాయ భూముల పక్కనే ఉన్న వాగుల్లో అమర్చిన మూడు విద్యుత్ సబ్ మెర్సిబుల్ మోటర్లు గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు ఆదివారం రైతులు తెలిపారు. పట్టణానికి చెందిన ఐనవేని నరేశ్, కీర్తి రవి, మేదరి రాజు పట్టణ శివారులో తమ పంటల సాగుకు వాగులో ఏర్పాటు చేసుకున్న 5హెచ్‌పీ సామర్థ్యం కలిగిన ముగ్గురికి చెందిన మూడు విద్యుత్ మోటర్లు, విద్యుత్ వైరు సైతం చోరీకి గురైనట్లు బాధిత రైతులు తెలిపారు. ఒక్కొక్క మోటరు విలువ సూమారు రూ.30 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

## ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి



రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 22 : మండలంలోని గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతోపాటు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి నిర్వహించారు. ఆదివారం పాఠశాల అవరణలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు.

## వెండి, బంగారు వర్తక సంఘం అధ్యక్షుడిగా గోపాల్



నియామక పత్రాలను అందజేస్తున్న ఎన్నికల అధికారులు

భైంసా, డిసెంబర్, 22 : భైంసా పట్టణ వెండి, బంగారు వర్తక సంఘం అధ్యక్షుడిగా మైస గోపాల్, ప్రధాన కార్యదర్శిగా కొర్వ శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా కలికోట రాములు, భూమన్న, అల్లాడి ప్రకాశ్, రవీంద్రమూర్తి వ్యవహరించగా, గెలిచిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.